తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నాగరాజా
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్
మంగళవారం
04 నవంబర్ 2025
సంపుటి 77
సంచిక 3
పేజీలు 7
వెల రూ. 5.00
Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna



## పరిశోధనలే దేశ భవిష్యత్తు..

- లక్ష కోట్ల నిధిని ప్రారంభించిన ప్రధాని మోదీ

- భారత్ మండపంలో ఎస్టిక్ 2025 సదస్సును ప్రారంభించిన ప్రధాని మోదీ
- రూ. లక్ష కోట్ల పరిశోధన, ఆవిష్కరణల నిధికి శ్రీకారం
- మహిళల క్రికెట్ జట్టు, ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రధాని అభినందనలు
- ప్రైవేటు రంగంలోనూ పరిశోధనలను ప్రోత్సహిస్తామన్న మోదీ

☞ 2

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో

# రాజకీయం తగదు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- ❖ టన్నెల్ పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్న రేవంత్ రెడ్డి
- ❖ టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు పూర్తి చేయడం కష్టంగా మారిందని వ్యాఖ్య
- ❖ బీఆర్ఎస్ హయాంలో 10 కిలోమీటర్లు కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శ




తరంగాలు, డెస్క్, నవంబర్ 03 : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేయడం సరికాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూలు జిల్లా మన్నెవారిపల్లెలో పర్యటించిన ముఖ్యమంత్రి, హెలీ మాగ్నటిక్ సర్వేకు సిద్ధంగా ఉన్న హెలికాప్టర్, ఆధునాతన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు చేయడం కష్టంగా మారిందని అన్నారు. ఈ పనులపై రాజకీయం చేయవద్దని కోరారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని అన్నారు. ప్రాజెక్టు మంజూరు చేసినప్పుడు పనుల అంచనా విలువ రూ. 1,986 కోట్లు అని, రెండు దశాబ్దాల్లో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడే నాటికి 30 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయిందని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదన్నరేళ్లలో ...

☞ 2

## రేవంత్ రెడ్డీ, నువ్వెంత.. మాగంటి సునీతకు మేం అండగా ఉన్నాం – కేటీఆర్



- బోరబండలో కేటీఆర్ రోడ్డు షో
- సునీతకు కేసీఆర్, కేటీఆర్, విష్ణు అండగా ఉన్నారని వ్యాఖ్య
- కాంగ్రెస్ గూండాగిరి చేస్తే అరగంటలో మీ ముందు ఉంటామని హామీ

తరంగాలు, డెస్క్, నవంబర్ 03 : "హిట్లర్ వంటి పెద్ద పెద్దవారే చరిత్రలో కలిసిపోయారు, ఇక నువ్వెంత రేవంత్ రెడ్డి, నీ బ్రతుకెంత!" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బోరబండలో రోడ్ షో నిర్వహించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లికి వచ్చిన బుల్డోజర్ రేపు జుబ్లీహిల్స్‌కు రాకుండా ఉండాలంటే మాగంటి సునీతను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.మాగంటి సునీత ఒక ఆడపిల్ల అని, ఆమె కష్టమొచ్చి చెప్పుకుంటే, బయటకు వస్తుందా అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారని, కానీ ఆమెకు తామంతా అండగా ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్, విష్ణువర్ధన్ రెడ్డి, తాను ఆమెకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. పక్కనే తెలంగాణ భవన్ ఉందని...

2



## ప్రధాని మోదీని కలవనున్న

# టీమిండియా అమ్మాయిలు!

- మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన టీమిండియా
- విజేత జట్టుతో ప్రధాని మోదీ బుధవారం భేటీ
- క్రీడాకారుణులకు బీసీసీఐ రూ. 51 కోట్ల భారీ నజరానా ప్రకటన
- ఫైనల్లో సత్తా చాటిన షఫాలీ వర్మ, దీప్తి శర్మ
- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం
- నవీ ముంబై నుంచి ఢిల్లీకి బయల్దేరనున్న జట్టు సభ్యులు

తరంగాలు, డెస్క్, నవంబర్ 03 : మహిళల వన్డే ప్రపంచకప్‌లో చారిత్రక విజయం సాధించి, తొలిసారి కప్పును ముద్దాడిన భారత జట్టు సభ్యులు ప్రధాని నరేంద్ర మోదీని కలవనున్నారు. ఐసీసీ మెగా టోర్నీ విజేతలుగా నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన బుధవారం ఢిల్లీలో ప్రధానితో సమావేశం కానున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ చారిత్రక విజయాన్ని పురస్కరించుకుని బీసీసీఐ జట్టుకు ..

మిగతా 3 లో..

# చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం

## -19 మంది మృతి

- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సును ఢీకొని, మీద పడిన కంకర లారీ
- ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లతో పాటు మహిళలు, చిన్నారి
- ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు, ముగ్గురి పరిస్థితి విషమం
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



తరంగాలు, డెస్క్, నవంబర్ 03 : రంగారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన లారీ, బస్సుపై బోల్తా పడింది. లారీలోని కంకర మొత్తం ప్రయాణికులపై పడటంతో చాలామంది దాని కింద చిక్కుకుపోయారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి, తిరిగి హైదరాబాద్‌లోని కార్యాలయాలు, కళాశాలలకు వెళు‍తున్న వారే వీరిలో అధికంగా ఉన్నారు. ప్రయాణికుల ఆర్తనాదాలతో ప్రమాద స్థలం హృదయవిదారకంగా మారింది.

మృతుల్లో బస్సు డ్రైవర్ దస్తగిరి, లారీ డ్రైవర్ సహా 12 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మూడు జేసీబీల సహాయంతో కంకరను తొలగించి, అందులో చిక్కుకున్న వారిని బయటకు తీస్తున్నారు. ఇప్పటివరకు కండక్టర్ రాధ సహా 15 మందిని సురక్షితంగా కాపాడారు. ఈ క్రమంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ కూడా గాయపడ్డారు.

క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్షతగాత్రులకు అత్యున్నత వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల కోసం గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. మృతులందరి పోస్టుమార్టం ఉస్మానియా ఆసుపత్రిలో ఒకేచోట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

### టీచర్ నరకయాతన

ప్రమాదంలో టిప్పర్ లోని కంకర మొత్తం బస్సులోని ప్రయాణికులపై పడింది. కంకరలో ఇరుక్కుని బయటకు రాలేక ప్రయాణికులు ఆర్తనాదాలు చేయడం స్థానికులను కంటతడి పెట్టించింది. తోల్కట్టలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ కాంట్రాక్ట్ టీచర్‌గా పనిచేస్తున్న జయసుధతో పాటు మరికొందరు నడుములోతు కంకరలో ఇరుక్కుని బయటకు రాలేకపోయారు. జయసుధకు కాళ్లు వాచిపోవడంతో కుటుంబసభ్యులు నిమ్స్‌కు తరలించారు.

### ప్రధాని మోడీ దిగ్భ్రాంతి

ఈ ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి విచారం

రోడ్డు ప్రమాదం విషయం తెలియగానే సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి, సహాయక చర్యలను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఉన్నతాధికారులను సూచించారు.

### కేసీఆర్, కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

ఈ ఘోర రోడ్డు ప్రమాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు మృతి చెందడం పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశ-

## చేవెళ్ల బస్సు ప్రమాదం జరిగిన చోట..

# ఎమ్మెల్యేపై దాడికి యత్నం!

- రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- బస్సు ప్రమాదం జరిగిన చోటుకు వచ్చిన ఎమ్మెల్యే కాలే యాదయ్య
- ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు



తరంగాలు, డెస్క్, నవంబర్ 03 : చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు బస్సు ప్రమాద స్థలిలో చేదు అనుభవం ఎదురైంది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి 163పై రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఆర్టీసీ బస్సుపై కంకర లోడుతో వెళుతున్న లారీ పడిపోవడంతో 19 మంది ప్రయాణీకులు మరణించగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు..

మిగతా 2 లో..

## రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి, కేంద్రంపై విమర్శలు..

# కాల్పుల విరమణ పొడిగించిన మావోలు

- ❖ తెలంగాణలో మరో 6 నెలల పాటు కాల్పుల విరమణ
- ❖ ప్రజల ఆకాంక్ష మేరకే పొడిగింపు అని వెల్లడి
- ❖ గత మే నెలలో ప్రకటించిన విరమణకు ఇది కొనసాగింపు
- ❖ శాంతి వాతావరణానికి కేంద్రం భంగం కలిగిస్తోందని ఆరోపణ



మిగతా 3 లో..

# కేటీఆర్, కవిత మధ్య పోరు..

## - వారసత్వ రాజకీయాలపై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

- వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ముప్పు అన్న శశిథరూర్
- తెలంగాణలో కేసీఆర్ తనయుడు, కవిత మధ్య వారసత్వ పోరు కొనసాగుతోందన్న థరూర్
- వారసత్వ నాయకత్వంతో పాలనా నాణ్యత దెబ్బతింటుందని వ్యాఖ్య

2



# ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ విషయంలో రాజకీయం తగదు:

## - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మొదటిపేజి తరువాయి..
బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదన్నరేళ్లలో 10 కిలోమీటర్ల టన్నెల్ కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. పెద్దగా కమీషన్లు రావని ఈ టన్నెల్‌ను పక్కకు పెట్టారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడును విస్తరిస్తుంటే కేసీఆర్ అప్పుడు చూస్తూ ఊరుకున్నారని ఆరోపించారు. రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉంటే ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీరు అందేదని చెప్పారు. కృష్ణానది మీద చెపట్టిన అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు.

బీఆర్‌ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు రూ. 1.86 లక్షల కోట్లు చెల్లించారని, ఆ మొత్తంలో కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ. 1.06 లక్షల కోట్లు చెల్లించారని రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ప్రాజెక్టులు నిర్మిస్తే, కేసీఆర్ మాత్రం ఏమీ నిర్మించలేకపోయారని మండిపడ్డారు.



# చేవెళ్ల బస్సు ప్రమాదం జరిగిన చోట..

## ఎమ్మెల్యేపై దాడికి యత్నం!

మొదటిపేజి తరువాయి..
ఈ ప్రాంతానికి కాలే యాదయ్య రాగా, ప్రయాణికులు 'ఎమ్మెల్యే డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేస్తూ, ఆయనపై దాడికి యత్నించారు. వారి నిరసనతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ప్రమాదం చాలా బాధాకరమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రహదారి మంజూరై ఆరేడు సంవత్సరాలు అవుతోందని తెలిపారు. ఈ రోడ్డు చాలా చిన్నగా ఉందని, ఈ ప్రాంతంలో ఎన్నోమార్లు ప్రమాదాలు జరిగాయని అన్నారు. రోడ్డు సన్నగా ఉండటం వల్ల వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్జీటీలో కేసుల వేసిన కారణంగా రోడ్డు వెడల్పు ఆలస్యమవుతోందని అన్నారు. టిప్పర్ వేగంగా వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిందని తాండూరు బస్ డిపో మేనేజర్ తెలిపారు. ఉదయం 7.05 గంటలకు ప్రమాదం జరిగిందని, టిప్పర్‌లో సుమార్ 50 టన్నుల కంకర ఉన్నట్లు వెల్లడించారు. గుంతను తప్పించబోయి టిప్పర్ బస్సును ఢీకొన్నట్లు తెలిసిందని తెలిపారు.

# పరిశోధనలే దేశ భవిష్యత్తు..

## - లక్ష కోట్ల నిధిని ప్రారంభించిన ప్రధాని మోదీ

మొదటిపేజి తరువాయి..
తరంగాలు, డెస్క్, నవంబర్ 03 : దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు భారీ ప్రోత్సాహం అందిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. సోమవారం ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఎమర్జింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఎస్టిక్) 2025'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో రూ. లక్ష కోట్ల 'పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల (%=ఐ×%) పథకం' నిధిని కూడా ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... తొలుత భారత మహిళల క్రికెట్ జట్టు సాధించిన చారిత్రక విజయం గురించి ప్రస్తావించారు. వారి అద్భుత ప్రదర్శనకు దేశం గర్విస్తోందని, యావత్ జట్టుకు తన అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. అలాగే, నిన్న ఇస్రో ప్రయోగించిన జీశాట్-7ఆర్ కమ్యూనికేషన్ ఉపగ్రహం విజయవంతం కావడంపై శాస్త్రవేత్తలను అభినందించారు. దేశంలో పరిశోధన, అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించేందుకే రూ. లక్ష కోట్ల ఆర్‌డీఐ ఫండ్‌ను ప్రారంభించామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించేందుకు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ రీసెర్చ్'కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఇందుకోసం ఇప్పటికే ఆర్థిక నియమాలు, సేకరణ విధానాల్లో సంస్కరణలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ దార్శనికత వల్లే శాస్త్ర సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. దశాబ్దాలుగా ప్రతిభ ఉన్నప్పటికీ మన శాస్త్రవేత్తలకు సరైన సౌకర్యాలు లేవని, కానీ మోదీ నాయకత్వంలో ఇప్పుడు వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని చెప్పారు. స్టార్టప్‌లు, గగన్‌యాన్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో సాధించిన ప్రగతితో భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ 'ఎస్టిక్ 2025' సదస్సులో విద్యాసంస్థలు, పరిశోధన కేంద్రాలు, పరిశ్రమలు, ప్రభుత్వ రంగాల నుంచి 3,000 మందికి పైగా ప్రతినిధులు, నోబెల్ గ్రహీతలు, శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, అంతరిక్ష సాంకేతికత సహా 11 కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. యువ ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, పరిశోధకులను పరిశ్రమలతో అనుసంధానం చేయడానికి, వారి ఆలోచనలకు సరైన వేదికను అందించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఒక ప్రకటనలో పేర్కొంది.

# ప్రధాని మోదీని కలవనున్న

## టీమిండియా అమ్మాయిలు!

మొదటిపేజి తరువాయి..
రూ. 51 కోట్ల భారీ నగదు బహుమతిని ప్రకటించింది.

ఆదివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శన చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' షఫాలీ వర్మ (87) అద్భుత ఇన్నింగ్స్, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' దీప్తి శర్మ (58) మెరుపులతో 7 వికెట్లకు 298 పరుగుల భారీ స్కోరు సాధించింది.

అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) శతకంతో పోరాడినా, భారత బౌలర్ల ధాటికి తలవంచక తప్పలేదు. ముఖ్యంగా దీప్తి శర్మ 5 వికెట్లతో సత్తా చాటడంతో దక్షిణాఫ్రికా 246 పరుగులకే ఆలౌట్ అయింది. దీప్తి ఆఖరి వికెట్ తీయగానే దేశవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. భారత సీనియర్ మహిళల జట్టుకు ఇదే తొలి ఐసీసీ ట్రోఫీ కావడంతో ఈ విజయం మరింత ప్రత్యేకంగా నిలిచింది.

ప్రస్తుతం నవీ ముంబైలో ఉన్న క్రీడాకారిణులు, సహాయక సిబ్బంది మంగళవారం సాయంత్రం ఢిల్లీకి బయల్దేరనున్నారు. ప్రధానితో సమావేశం అనంతరం వారు తమ స్వస్థలాలకు వెళతారు. జట్టుకు ప్రకటించిన రూ. 51 కోట్ల నగదు బహుమతిని క్రీడాకారులు, సహాయక సిబ్బంది, ఐదుగురు సభ్యుల జాతీయ సెలక్షన్ కమిటీకి పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది.

లీగ్ దశలో వరుసగా మూడు ఓటముల తర్వాత అద్భుతంగా పుంజుకున్న టీమిండియా, సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై 339 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించింది. ఆ తర్వాత ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించి, స్వదేశంలో అభిమానుల మధ్య టైటిల్ గెలిచి దశాబ్దాల నిరీక్షణకు తెరదించింది.

# రేవంత్ రెడ్డీ, నువ్వెంత.. మాగంటి సునీతకు మేం అండగా ఉన్నాం - కేటీఆర్

మొదటిపేజి తరువాయి..
అర్ధరాత్రి ఫోన్ చేసినా అర్ధగంటలో మీ ముందు ఉంటామని, కాంగ్రెస్ నాయకులు వచ్చి గూండాగిరి చేస్తే గల్లా పట్టి నిలదీస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఓటు వేయకుంటే పథకాలు రద్దు చేసామని రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని, అది రేవంత్ రెడ్డి సొంత డబ్బుతో ఇస్తున్నారా అని ప్రశ్నించారు. హైడ్రా బాధితులను చూస్తే ప్రతి ఒక్కరి కళ్ల వెంట నీళ్లు వస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో వేలాది మంది పేదల ఇళ్లను కూల్చివేశారని ఆయన మండిపడ్డారు. హైడ్రా అనే రాక్షసి మాయం కావాలంటే కారు గుర్తుకు ఓటేసి సునీతను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కేసీఆర్ తిరిగి ఈ రాష్ట్రానికి నాయకత్వం వహించాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కరిని కూడా మోసం చేయకుండా విడిచిపెట్టదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ హామీలు ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇంకా అమలు చేయడం లేదని



కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకు పేదల ఇళ్లు కూలగొట్టారని ఆయన ఆరోపించారు.

# కేటీఆర్, కవిత మధ్య పోరు..

## - వారసత్వ రాజకీయాలపై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజి తరువాయి..
తరంగాలు, డెస్క్, నవంబర్ 03 : వారసత్వ రాజకీయాల్లో ప్రతిభకు పట్టం కట్టాల్సిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ అభిప్రాయపడ్డారు. వారసత్వ రాజకీయాలు భారత ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తాయని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కేసీఆర్ తనయుడు కేటీఆర్, కుమార్తె కవితల మధ్య వారసత్వ పోరు కొనసాగుతోందని ఒక వార్తా సంస్థ కథనంలో ఆయన పేర్కొన్నారు. సామర్థ్యం, నిబద్ధత, క్షేత్రస్థాయిలో పనితీరు వంటి అంశాల ఆధారంగా కాకుండా వారసత్వం ద్వారా రాజకీయ అధికారాన్ని నిర్ణయిస్తే పరిపాలనా నాణ్యత దెబ్బతింటుందని ఆయన అన్నారు. అన్ని పార్టీలలోనూ కుటుంబ రాజకీయాలు సహజంగా కనిపిస్తుంటాయని శశిథరూర్ పేర్కొన్నారు. నెహ్రూ-గాంధీ వంశ ప్రభావం స్వాతంత్ర్య పోరాటంతో ముడిపడి ఉండటం వల్ల దశాబ్దాలుగా ఒకే కుటుంబం రాజకీయాలను శాసిస్తోందని అన్నారు. రాజకీయ నాయకత్వం అనేది పుట్టుకతో వచ్చే హక్కు అనే భావనను ఇది స్థిరపరిచిందని ఆయన అన్నారు. ప్రతి పార్టీ, ప్రాంతం, స్థాయిలోనూ ఇది చొచ్చుకుపోయిందని అన్నారు. బిజూ పట్నాయక్-నవీన్ పట్నాయక్, బాల్ ఠాక్రే-ఆదిత్య ఠాక్రే, ములాయం సింగ్



యాదవ్-అఖిలేశ్ యాదవ్, ఫరూఖ్ అబ్దుల్లా-ఒమర్ అబ్దుల్లా, కరుణానిధి-ఎం.కె. స్టాలిన్-ఉదయనిధి వంటి ఉదాహరణలను ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగానే ఆయన కేసీఆర్ వారసుల అంశాన్ని ప్రస్తావించారు. కుటుంబం అనేది ఒక బ్రాండ్‌గా ఉపయోగపడటం ఈ తరహా రాజకీయాలకు ఒక కారణం కావొచ్చని ఆయన అన్నారు. ఇంట్లో ఒకరికి గుర్తింపు లభిస్తే తదుపరి తరం అభ్యర్థులకు ఓటర్లను ఆకట్టుకోవడానికి, విశ్వాసాన్ని పెంచుకోవడానికి అంతగా కష్టపడాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ప్రతిభను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి, కేంద్రంపై విమర్శలు..

## కాల్పుల విరమణ పొడిగించిన మావోలు



తరంగాలు, డెస్క్, నవంబర్ 03 : తెలంగాణలో కాల్పుల విరమణను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో సోమవారం ఓ అధికారిక లేఖ విడుదలైంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో స్పష్టం చేశారు. గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రాష్ట్రంలో శాంతియుత వాతావరణం కోసం వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక వర్గాలు ఉద్యమించాయని, వారి ఆకాంక్షలకు అనుగుణంగానే తాము గత మే నెలలో ఆరు నెలల పాటు కాల్పుల విరమణ ప్రకటించామని జగన్ గుర్తుచేశారు. ఆ గడువు ముగిసిన నేపథ్యంలో, ప్రజల అభీష్టం మేరకు మరో ఆరు నెలల పాటు ఈ విరమణను కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గడిచిన ఆరు నెలల కాలంలో తమ వైపు నుంచి సంపూర్ణంగా శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉన్నామని, భవిష్యత్తులోనూ ఇదే పంథాను అనుసరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలో వ్యవహరించిన విధంగానే సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం తెలంగాణలో నెలకొన్న శాంతి వాతావరణానికి భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తన లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వ దుందుడుకు చర్యలను అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, మేధావులు ఏకతాటిపైకి వచ్చి వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఓవైపు మావోయిస్టులు తెలంగాణలో కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ, మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. మావోయిస్టులతో ఎలాంటి కాల్పుల విరమణ ఒప్పందం ఉండబోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవలే ఓ బహిరంగ సభలో తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మావోయిస్టుల తాజా ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# ధాన్యం కొనుగోలు కేంద్రం

## ప్రారంభించిన కూసుమంచి తహసీల్దార్



పాలేరు ఆర్సీ, 03 నవంబర్ (తరంగాలు) కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు సెంటర్ ను కూసుమంచి తహసీల్దార్ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాలలో దళారులను నమ్మి ధాన్యం అమ్ముకుని మోసపోవద్దని తెలిపారు. సన్నరకానికి ప్రభుత్వం మద్దతు ధరతోపాటు బోనస్ ఇస్తుందని అన్నారు. సమాఖ్య సభ్యులనుద్దేశించి కొనుగోలు కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాటిపాముల జశ్వంత్ కుమార్, ఎంపీఓ రాంచందర్ రావు, అగ్రికల్చర్ ఏఓ రామడుగు వాణి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, సీసీ, శ్రీ వెంకటేశ్వర గ్రామ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, వీవోఏ, రైతులు పాల్గొన్నారు.

# రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

- రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలి
- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 03,(తరంగాలు) : మండలంలో ని ఉప్పుగల్,కునూరు గ్రామాల మార్గమధ్యలో, వర్షాలతో నష్టపోయిన పంటలను,రోడ్లను పరిశీలించిన అనంతరం బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే,మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొంథా తుఫాను ప్రభావం వలన చేతికొచ్చిన పంటలు నేలపాలయ్యాయని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం జరిగినప్పుడు, అన్నదాతలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపథకాన్ని రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని, నష్టపోయిన పంటలని సంబంధిత అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి, రైతులను ఆదుకోవాలని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, తెగిపోయిన అంతర్గత రోడ్లను వెంటనే మరమ్మత్తు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జనగామ జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల సారయ్య,బూత్ అధ్యక్షులు తీగారపు బుచ్చయ్య, ఇల్లందుల యాకయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, సకినాల కొమురెల్లి, పెద్దపల్లి కుమారస్వామి, చత్రబోయిన సుధాకర్, చాగంటి కొమురయ్య, బుర్ర సారయ్య, వేముల రాములు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో తల్లిని చంపిన తనయుడు





పాలేరు ఆర్సీ, 03 నవంబర్ (తరంగాలు) : తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో ఆదివారం రాత్రి తన తల్లి మద్యానికి డబ్బులు ఇవ్వలేదని నెపంతో హతమార్చిన కొడుకు. వివరాల్లోకెళితే మృతురాలి తమ్ముడు అయినా నల్లగట్టు కాశయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన మేనల్లుడు అయిన మందుల మధు తండ్రి వెంకన్న మధ్యాహ్నం భార్యతో ఎప్పుడూ గొడవ పడుతూ ఉండటం భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని తన భార్య వెళ్లిపోవడానికి కారణం తన తల్లి మందుల బూబా అని ఎప్పుడు తల్లితో గొడవ పడుతుండేవాడు మరియు మద్యం తాగడానికి తల్లి వద్ద పెన్షన్ డబ్బులు ఇవ్వమని గొడవ చేస్తూ ఉండేవాడు . ఆదివారం రాత్రి మళ్లీ మద్యం కోసం డబ్బులు అడగడం డబ్బులు లేదన్నందున గొడ్డలితో కొట్టడంతో మందుల భూభా 49 సంవత్సరాలు చనిపోయిందని ఫిర్యాదు చేయడం జరిగింది .నల్లగట్టు కాసే ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు మందుల మదుపై కేసు నమోదు చేసి డెడ్ బాడీని శవ పంచనామా నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. అరెస్టు చేయడమైనది అని తిరుమలాయ-పాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినప్పుడు తెలిపారు.

# సోలార్ ఎనర్జీ రంగంలో శ్రీనివాస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్

- ఏడు సంవత్సరాల పరిశోధనకు ప్రతిఫలం
- పి.వి ఇన్వెర్టర్ల సమాంతర ఆపరేషన్‌పై వినూత్న అధ్యయనం



కేసముద్రం,మహబూబాబాద్, ప్రతినిధి,నవంబర్. 03, తరంగాలు: కేసముద్రంఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి చీర శ్రీనివాస్ సోలార్ ఎనర్జీ రంగంలో వినూత్న పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. అడాప్టివ్ వర్చువల్ ఇన్నేర్సియా అండ్ డ్రూప్ కంట్రోల్ ఫర్ పారలల్ ఆపరేషన్ ఆఫ్ పి.వి ఇన్వెర్టర్స్అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను మంజూరు చేసింది. చీర శ్రీనివాస్‌కు ప్రొఫెసర్ బి. మంగు మరియు ప్రొఫెసర్ టి. మురళికృష్ణ మార్గదర్శకత్వం వహించారు. మొత్తం ఏడు సంవత్సరాలపాటు సాగిన ఈ పరిశోధన, సోలార్ పవర్ సిస్టమ్‌లలో స్థిరత్వం, ఇన్వెర్టర్ నియంత్రణ, శక్తి సమతుల్యం వంటి కీలక సాంకేతిక అంశాలను ప్రతిపాదించింది. భవిష్యత్తులో పెద్ద స్థాయి సోలార్ గ్రిడ్‌ల్లో వినియోగదారులకు స్థిరమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాలో ఇది ఎంతో ఉపయుక్తం అవుతుందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు ఆయనకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఈ విజయంతో ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబం మరియు అధ్యాపకుల సహకారం లేకుండా ఈ విజయం సాధ్యపడేదేమీ కాదని శ్రీనివాస్ తెలిపారు.

# బీసీ జాక్ 42 శాతం బీసీల రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్వో కి వినతి పత్రం



కేసముద్రం,మహబూబాబాద్, ప్రతినిధి,నవంబర్. 03, తరంగాలు: బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగాలు ,స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ బిల్లుల తొమ్మిదవ షెడ్యూల్డ్ చేర్పు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు గురించి రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగంగా సోమవారం స్థానిక ఎమ్మార్వో కి వినతి పత్రం బీసీ జాక్ 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ప్రతినిధులు ఇవ్వడం జరిగింది .ఈ సందర్భంగా బీసీ జాక్ చైర్మన్ బీసీ ఇంటలెక్చువల్ ఫోరం తరఫున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిల్ నెంబర్ మూడు నాలుగు ద్వారా మార్చి 2025లో విద్యా, ఉద్యోగ ఉద్యోగాలు ,స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ ఆమోదించింది .ఈ బిల్లులో గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత కేంద్రానికి పంపబడి గత ఏడు నెలలుగా కేంద్రం వద్ద తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడానికి పెండింగ్లో ఉన్నాయి .రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి, కేంద్రంపై ఒత్తిడి పెంచి తొమ్మిదవ షెడ్యూల్లో అమలు చేయించే బాధ్యతను తనపై వేసుకొని 42% రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లులను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .వీటితో పాటుగా బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి మరియు వాడికి సంబంధించిన నిధులు కూడా కేటాయించాలని కోరారు .నామినేట్ పోస్టుల్లో, కమిషన్లు ,బోర్డులో మరియు సలహా మండలాల్లో 90 శాతం ప్రాతినిధ్యం బీసీ, ఎస్సీ ఎస్టీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు .ఇది సామాజిక న్యాయం, సమాన అవకాశాలకు ,తగు ప్రాతినిధ్యం, రాజ్యాంగ స్ఫూర్తిగా అనుగుణమని మేము గట్టిగా నమ్ముతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి జిల్లా ప్రధాన కార్యదర్శి సామల నర్సయ్య, కంచ వెంకన్న ,శీలం సత్యనారాయణ , సామల వెంకటేశ్వర్లు, రామడుగు శ్రీనివాస్ సామల రమేష్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలి

- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి
- నవంబర్ 20 నాటికి లక్ష్యం మేరకు చేప పిల్లల విడుదల పూర్తి చేయాలి : వాకాటి శ్రీహరి
- మత్స్యశాఖ పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన మంత్రి






మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్. 03,తరంగాలు : చేప పిల్లలు చెరువులకు చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి సోమవారం హైదరాబాద్ నుంచి మత్స్య శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో స్థానిక సంస్థలుతో కలిసి పాల్గొన్నారు. చేపల పంపిణీ టెండర్ల ఫైనల్ చేయడం, చేపల పంపిణీ పర్యవేక్షణ ఇతర శాఖల అధికారుల నియామకం, యాక్షన్ ప్లాన్ తయారీ తదితర అంశాల పై రివ్యూ నిర్వహించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి మాట్లాడుతూ..122 కోట్ల 22 లక్షల ఖర్చు చేసి 83 కోట్ల చేప పిల్లలను ,10 కోట్ల రొయ్య పిల్లలను 26 వేల 357 నీటి వనరులలో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. చేపలు పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ఆలస్యమైందని, నవంబర్ 20 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు నీటి వనరులలో చేప, రొయ్య పిల్లల విడుదల పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. చేపల పంపిణీ కార్యక్రమం అమలులో చాలా జిల్లాలు వెనుకబడి ఉన్నాయని, కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి నీటి వనరుల్లో చేప పిల్లల విడుదల కార్యక్రమం వేగవంతం గా పూర్తి చేయాలని, ప్రస్తుత సమయంలో నీటి వనరులలో చేపలు విడుదల చేస్తేనే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. టీ-మత్స్య యాప్ లో చేప పిల్లల వివరాలు సరఫరాదారుల వివరాలు రవాణా చేసే వాహనం సంపూర్ణ వివరాలను మత్స్య శాఖ అధికారి పకడ్బందీగా నమోదు చేయాలని అన్నారు. చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పూర్తి స్థాయిలో పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతి నీటి వనరుల దగ్గర ఎన్ని చేప పిల్లలు విడుదల చేస్తున్నామో వివరాలు తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. చేప పిల్లల కార్యక్రమం ఆలస్యం అవుతున్న కొద్దీ మత్స్యకారులు ఇబ్బందులకు గురవుతారని, ఆ అంశాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని మంత్రి సూచించారు. చేపల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్య శాఖ అధికారులతో పాటు నీటి పారుదల శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఎంపీడీవో, జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పర్యవేక్షించాలని మంత్రి తెలిపారు. జిల్లాలోని ప్రతి రిజర్వాయర్ కు నీటిపారుదల అధికారి, పంచాయతీ అధికారి, చెరువులకు ఎంపీడీవో మండల వ్యవసాయ అధికారి, కుంటలకు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని అన్నారు. రాబోయే 18 రోజుల పాటు చాలా కీలకంగా ఉంటుందని అన్నారు. గతంలో ఉన్న అభియోగాలను పూర్తిగా తొలగించేలా పారదర్శకంగా ఈ కార్యక్రమం జిల్లాలో నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. చేపల పంపిణీ కార్యక్రమానికి రాజకీయాలకతీతంగా ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. చేపల విడుదల సమాచారం సంబంధిత మత్స్యకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు అందించాలని,చేపల ఉత్పత్తి పెంచడంతో పాటు వాటి విక్రయానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్థలాలలో చేపల స్టాల్స్, ఫిష్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, శ్రీనివాస్ సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 7న పెన్షనర్ల ఛలో హైదరాబాద్

- సమస్యలు పరిష్కరించాలనిడిమాండ్.
- విజయవంతం చేయాలని పిలుపు



పాలేరు ఆర్సీ, 03 నవంబర్ (తరంగాలు) : రిటైర్డ్ ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మేదరమెట్ల సుబ్బయ్య ,జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు ,సోమవారం పెన్షనర్లకు పిలుపునిచ్చారు. గత 19నెలలుగా రిటైర్ అయిన ఉద్యోగులకు రావలసిన జీపీఎఫ్ గ్రాచుటీ సరెండర్ లీవ్ కమ్యూటేషన్ తదితర ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయకుండా పెన్షనర్లను మానసికంగా ఇబ్బందులకు గురి చేయడం వలన కొంతమంది పెన్షనర్లు మరణించారని మరి కొంతమంది అనారోగ్యంతో ఆసుపత్రిపాలయ్యారని వారన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేయడం వలన ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఎన్నో ఆశలతో ఉన్న ఉద్యోగులను పెన్షనర్లను తీవ్ర నిరాశలకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విధానాలు నిరసిస్తూ ఈ నెల 7న హైదరాబాదులో నీ ఇందిరా పార్కు వద్ద జరిగే పెన్షనర్ల నిరసన ధర్నాలు పెద్ద ఎత్తున జిల్లాలోని పెన్షనర్లందరూ పాల్గొనాలని తెలిపారు. సోమవారం కూసుమంచి మండల సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధ్యక్షులు రావెళ్ల రామయ్య అధ్యక్షులు జరిగిన సమావేశంలో మండల శాఖ కార్యదర్శి దాములూరి అప్పారావు, మండల నాయకులు డీ నరసయ్య, బీ రామిరెడ్డి, ఎం నాగులు, జిల్లా నాయకులు రమణ యాదవ్, రాంబాబు, సంజీవరెడ్డి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## అభినందనలు

అమ్మాయిల ప్రపంచ క్రికెట్ లో
విజయం సాధించి విశ్వవిజేతగా
నిలిచిన మీకు వందనం అభివందనం

ఓర్పు నేర్పులతో క్రికెట్ యుద్ధంలో విజయం సాధించిన మీకు వందనం అభివందనం

మైదానంలో అద్భుత బ్యాటింగ్ బౌలింగ్ విన్యాసాలతో విజయం సాధించి దేశ గౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటిన మీకు అభినందన మందార చందన మాలలు

విజయోస్తు మహిళా భారత క్రికెట్ సభ్యులకు

జయహో భరతమాత ముద్దు బిడ్డలకు

మహిళలు అబలలు కాదు, సబలలు అని నిరూపించి త్రివర్ణ పతాకం సగర్వంగా



ఎగిరెలా చేసిన మహిళా భారత క్రికెట్ సభ్యులకు అభినందనలు

రచన మంజుల పత్తిపాటి
మాజీ డైరెక్టర్
ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
9347042218

## దళారి వ్యవస్థ నిర్మూలనకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- రైతులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- డిఆర్డిఏ-డిఆర్డిఓ, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి



పర్వతగిరి,నవంబర్ 03, తరంగాలు: దళారి వ్యవస్థ నిర్మూలించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని లక్ష్యంతోనే ప్రభుత్వం అన్ని గ్రామాల్లో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అకాల వర్షాల పట్ల రైతులు ఆందోళన చెందకుండా అప్రమత్తము కావాలని వరంగల్ డిఆర్డిఏ, డిఆర్డిఓ, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి అన్నారు.సోమవారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో అన్నారం రావూరు కల్లెడ పర్వతగిరి మాల్యా తండా గ్రామాల్లో గ్రామైక్య సంఘాల మహిళల చేత నిర్వహించబడుతున్న ఐకెపి (సెర్ప్) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తాసిల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ నాయక్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ రామిరెడ్డి మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో పడుతున్న వర్షాలకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హార్వెస్టర్ ఉపయోగించినప్పుడు తాలు మట్టి మొదలగునవి రాకుండా ఆర్పిఎం 18, 20 ఉండేలా ప్రతి రైతు చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ప్యాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేసిన ధాన్యాన్ని తేమశాతం 17 లోపు ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తద్వారా రైతులకు నిర్వాహకులకు మిల్లర్ల నుండి ఎలాంటి ఇబ్బందులు ఉండవని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రూర్బన్ ప్రాజెక్టు కింద నిర్మించిన గోదాములను పర్వతగిరి సిబ్బందితో కలిసి డిఆర్డిఓ రాంరెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాసిల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ నాయక్, సెర్ప్- డిఆర్డిఏ ప్రాజెక్ట్ మేనేజర్ దాసు ఎంపీ ఓ శేషు, ఏవో ప్రశాంత్, ఏపిఎం రాజీర్, కిసాన్ సెల్ జిల్లా నాయకులు బొంపెల్లి దేవేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, మండల సమైక్య అధ్యక్ష కోశాధికారులు స్వప్న ఫరీదా బేగం, సెర్ప్ సీసీలు కొమురయ్య సుధాకర్ దేవేంద్ర ఆయా గ్రామాల స్థానిక అధికారులు, సమైక్య సంఘాల వివో ఏలు ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన ఎంజీఎం సూపరింటెండెంట్



వరంగల్ ప్రతినిధి,03 నవంబర్, తరంగాలు : వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన డా. పి.హరీష్ చంద్రా రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ డా.సత్య శారద ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు

- మురుగు కాలువలు శుభ్రం చేసిన పారిశుద్ధ కార్మికులు



హనుమకొండ, నవంబర్ 03, తరంగాలు వరంగల్ 46వ డివిజన్ మడికొండ రొట్టెబండలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధి లోని కాజీపేట మండలంలో వర్ధన్నపేట శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండ రొట్టెబండలో జిడబ్ల్యూఎంసి గ్యాంగ్ వర్క్ నిర్వహించి, మురుగు కాలువలు శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ వస్కుల శంకర్ 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, జి డబ్ల్యూ ఎం సి జవాన్ మంద అనిల్, సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, హేమంత్, కాలనీవాసులు వల్లెపు రవి, వల్లెపు కృష్ణ, కుల పెద్ద ఎత్తరి వెంకటయ్య, వల్లెపు కుమార్, రాపోలు రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పనిచేయాలి

### - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్గొండ ఆర్సి, నవంబర్ 3, తరంగాలు : పోలీస్ గ్రీవెన్స్ డే లో పలు ఫిర్యాదులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 45 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాయపర్తి, నవంబర్ 03, తరంగాలు: మండలంలోని కాట్రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 2002-2003 బ్యాచ్ కు చెందిన విద్యార్థులు 23 ఏళ్ల తర్వాత గ్రామంలోని పాఠశాల ఆవరణంలో సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులతో పెన వేసుకున్న తమ అనుబంధాన్ని తీపి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. 23 సంవత్సరాల నాటి మధురస్మృతులను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. ఇన్నేళ్ల తరువాత వారంతా ఒక చోట చేరి ఆత్మీయ సమ్మేళనం వేదికగా కలుసుకొని అప్పటి ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. చిన్ననాటి మిత్రులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులను జ్ఞాపికలు, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు వారి అనుభవాలను ప్రస్తుతం వాళ్లు చేస్తున్న వృత్తి ఉద్యోగాలు, కుటుంబ సభ్యుల గురించి చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 23 ఏళ్ల తర్వాత జరిగిన ఈ అపూర్వ ఆత్మీయ సమ్మేళనంతో పాఠశాల ఆవరణం సందడిగా మారింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మహేశ్వరి, యాకూబ్ పాషా, కృష్ణ లను అప్పటి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలలో బిజెపి అభ్యర్థిని గెలిపించండి - మాజీ ఎంపీ బిబి పటేల్




తరంగాలు, సంగారెడ్డి, నవంబర్ 3 : జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి లంకల దీపక్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పటేల్ పిలుపునిచ్చారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం యూసుఫ్‌గూడ డివిజన్‌లోని లక్ష్మీ నరసింహ నగర్‌లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, ప్రజలు అభివృద్ధికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్-2 టౌన్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి బసంతాపురం, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో 67 దరఖాస్తులు - జిల్లా కలెక్టర్




తరంగాలు, సూర్యాపేట, నవంబర్ 3 : ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబంధించి 19 దరఖాస్తులు, ఎంపిడిఓ లకి 4, డి పి ఓ కి 2, మిగిలిన 42 దరఖాస్తులు ఇతర శాఖలకి సంబంధించి వచ్చాయని మొత్తం 67 ధరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకి పంపించటం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఎ పిడి వివి అప్పారావు,డి పి ఒ యాదగిరి, డి ఇ ఓ అశోక్, సంక్షేమ అధికారులు నరసింహారావు, శంకర్, శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డి శ్రీనివాస్, హౌజింగ్ పీడీ సిద్దార్థ, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేళ్లచెరువు కట్టపై గండి పూడ్చివేత



తరంగాలు / యాదాద్రి భువనగిరి, నవంబర్ 3 : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని మేళ్లచెరువు నిండిపోయి చెరువు కట్టపై ప్రమాదకరమైన గండి ఏర్పడింది. ఈ విషయాన్ని స్థానిక రైతులు , వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తక్షణమే స్పందించి గండిని పూడ్చే చర్యలు చేపట్టి పంటలు రక్షించేలా ముందడుగు వేశారు. ఈ కార్యక్రమం రాజగోపాల్ రెడ్డి సూచనలతో, సహకారంతో సోమవారం పూర్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు ఎమ్మెల్యే కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు ఇరిగేషన్ ఏఈ జానయ్య, నారాయణపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కిడి చంద్ర రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు చిమిర్యల మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి ,కత్తుల లక్ష్మయ్య, గుజ్జ రామచంద్రం, వెంకటరెడ్డి, కేసాని దిలీప్, ఎర్ర సైదులు, దొల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కే ఎన్ ఎం 1638 వరి విత్తనంతో అధిక దిగుబడులు



తరంగాలు, ఇబ్రహీంపట్నం, నవంబర్ 3 : కే ఎన్ ఎం 1638 వరి విత్తనంతో అధిక దిగుబడులు పొందవచ్చునని ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణలత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. వానాకాలం సీజన్ ప్రారంభంలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం (క్యూఎస్ యువి )లో భాగంగా కే ఎన్ ఎం 1638 అందచేశారు. ఆయా పొలాలను సోమవారం క్షేత్ర సందర్శనలో భాగంగా క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. 125 రోజులలో కోతకు వచ్చే ఈ రకం 28 క్వింటాల దిగుబడి నీ ఇస్తుందని వారు తెలిపారు. ఈ రకాన్ని రెండు పంటలకు వేయవచ్చని, ఈ రకాన్ని సాగు చేసిన రైతులందరూ పాల్గొని ఎక్కడ తెల్లకంకి రాలేదని, వడ్లు నిండుగా చేను మీద కనిపిస్తున్నాయని తెలిపారు. రసాయన ఎరువులు తక్కువ వాడుకొని తక్కువ ఖర్చుతో సాగు చేశామన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. ఈ రకం సాగు చేసిన రైతులు, తమ ప్రక్క రైతులకు కూడా విత్తనాలను సరఫరా చేయాలని కోరారు. రైతు స్థాయిలో విత్తనోత్పతి సరఫరా జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్.స్వర్ణలత, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ హన్మంత్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ , వ్యవసాయ విస్తరణ అధికారులు సాయి సిరి, సాయివాణి, లింగస్వామి, వివిధ గ్రామాల నుండి రైతులు పాల్గొన్నారు.

# సెట్విన్ ఆధ్వర్యంలో వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలు

## - జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి





నల్గొండ ఆర్సి, నవంబర్ 3, తరంగాలు పది,ఇంటర్ చదువు తర్వాత విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందేందుకుగాను సెట్విన్ ఆధ్వర్యంలో వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్ విద్యార్థులకు మండలాల ప్రత్యేక అధికారులు, సంక్షేమ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకించి మహిళలకు ఉద్దేశించి బ్యూటిఫికేషన్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సులు కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం ఆమె జిల్లా అధికారులతో మాట్లాడుతూ సెట్విన్ ద్వారా కల్పించే వృత్తిపరమైన కోర్సుల శిక్షణ లో భాగంగా ఈనెల 4న నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని రామ్ నగర్ అల్పసంఖ్యాక వర్గాల రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రారంభిస్తున్నట్టు ఆమె తెలిపారు. సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు నామమా-త్రపు ఫీజు చెల్లించి వలసి ఉంటుందని, ఎవరైనా ఫీజు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న అతి పేద విద్యార్థులకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందిస్తామని ఆమె వెల్లడించారు. సెట్విన్ ఇచ్చే శిక్షణ కోర్సులలో భాగంగా సుమారు 26 రకాల కోర్సులు ఉన్నాయని, వాటిలో కంప్యూటర్ కోర్సులు, మహిళలకు ఉద్దేశించిన ప్రత్యేక కోర్సులు, ఎడ్యుకేషన్ కోర్సులు, టెక్నికల్ కోర్సులు ఉన్నాయని , ఇవన్నీ 3 నుండి 6 నెలల స్వల్పకాల వ్యవధి శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని, వీటిలో శిక్షణ పొందడం ద్వారా 10, ఇంటర్మీడియట్ వంటి విద్య పూర్తయిన వెంటనే ఏదైనా రంగంలో ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుందని, శిక్షణ పొందిన వారికి సెట్విన్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ శిక్షణా కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని చెప్పారు. జిల్లాలో ఉన్న రెసిడెన్షియల్ కె జి బి వి పాఠశాలల విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,ఇన్చార్జి డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, చండూరు, దేవరకొండ ఆర్డిఓలు శ్రీదేవి, రమణారెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.

# చేప పిల్లల పంపిణీ కార్యక్రమం

## పారదర్శకంగా నిర్వహించాలి






- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి
- మత్స్యశాఖ పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన మంత్రి

వరంగల్ ప్రతినిధి, 3 నవంబర్, తరంగాలు: చేప పిల్లలు చెరువులకు చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి సోమవారం హైదరాబాద్ నుంచి మత్స్య శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.చేపల పంపిణీ టెండర్ల ఫైనల్ చేయడం, చేపల పంపిణీ పర్యవేక్షణ ఇతర శాఖల అధికారుల నియామకం,యాక్షన్ ప్లాన్ తయారీ తదితర అంశాల పై రివ్యూ సమీక్షించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 122 కోట్ల 22 లక్షల ఖర్చు చేసి 83 కోట్ల చేప పిల్లలను ,10 కోట్ల రొయ్య పిల్లలను 26 వేల 357 నీటి వనరులలో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. చేపలు పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ఆలస్యమైందని, నవంబర్ 20 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు నీటి వనరులలో చేప, రొయ్య పిల్లల విడుదల పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. చేపల పంపిణీ కార్యక్రమం అమలులో చాలా జిల్లాలు వెనుకబడి ఉన్నాయని, కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి నీటి వనరుల్లో చేప పిల్లల విడుదల కార్యక్రమం వేగవంతం గా పూర్తి చేయాలని, ప్రస్తుత సమ-యంలో నీటి వనరులలో చేపలు విడుదల చేస్తేనే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. టీ-మత్స్య యాప్ లో చేప పిల్లల వివరాలు సరఫరాదారుల వివరాలు రవాణా చేసే వాహనం సంపూర్ణ వివరాలను మత్స్య శాఖ అధికారి పకడ్బందీగా నమోదు చేయాలని అన్నారు. చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పూర్తి స్థాయిలో పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతి నీటి వనరుల దగ్గర ఎన్ని చేప పిల్లలు విడుదల చేస్తున్నామో వివరాలు తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. చేప పిల్లల కార్యక్రమం ఆలస్యం అవుతున్న కొద్దీ మత్స్యకారులు ఇబ్బందులకు గురవుతారని, ఆ అంశాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని మంత్రి సూచించారు.చేపల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్య శాఖ అధికారులతో పాటు నీటి పారుదల శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఎంపీడీవో, జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసా-య విస్తరణ అధికారులు పర్యవేక్షించాలని మంత్రి తెలిపారు.జిల్లాలోని ప్రతి రిజర్వాయర్ కు నీటిపారుదల అధికారి, పంచాయతీ అధికారి, చెరువులకు ఎంపీడీవో మండల వ్యవసాయ అధికారి, కుంటలకు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని అన్నారు.రాబోయే 18 రోజుల పాటు చాలా కీలకంగా ఉంటుందని అన్నారు. గతంలో ఉన్న అభి యోగాలను పూర్తిగా తొలగించేలా పారదర్శకంగా ఈ కార్యక్రమం జిల్లాలో నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. చేపల పంపిణీ కార్యక్రమానికి రాజకీయాలకతీతంగా ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. చేపల విడుదల సమాచారం సంబంధిత మత్స్యకార సంఘాల అధ్యక్షులు కార్యదర్శులకు అందించాలని,చేపల ఉత్పత్తి పెంచడంతో పాటు వాటి విక్రయానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్థలాలలో చేపల స్టాల్స్, ఫిష్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో ఒక రిజర్వాయర్లు, 70 పెరినియల్ చెరువులు మరియు 635 సీజనల్ చెరువులలో కోటి 93 లక్షల చేప పిల్లల పంపిణీ విడుదల ఈ నెల 6వ తేదీ నుండి ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, సీనియర్ అసిస్టెంట్ రియాజ్ అహ్మద్ ఖాన్ అధికారి పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమేనే పరిష్కరించాలి

### - రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

తరంగాలు / ఇబ్రహీంపట్నం, నవంబర్ 3 : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమేనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించా రు. ముందుగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ మండలం మీర్జాగూడ వద్ద సోమవారం ఉదయం జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీత, జిల్లా అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులందరు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు. ప్రజావాణికి (25) ఫిర్యాదులు ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులు పంపించడం జరిగిందని, ఆయా శాఖల అధికారులు సత్వర పరిష్కారానికి



ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ – 15, ఇతర శాఖలకు – 10, మొత్తం 25 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## చేప పిల్లల పంపిణీకి సర్వం సిద్ధం

### - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

నల్గొండ ఆర్సి, నవంబర్ 3, తరంగాలు : పోలీస్ గ్రీవెన్స్ డే లో పలు ఫిర్యాదులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 45 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా




బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జోరు..

### - హస్తం గుర్తుకు ఓటేయాలని మంత్రి పొంగులేటి, విప్ బీర్ల ప్రచారం

తరంగాలు, కుత్బుల్లాపూర్ / నవంబర్ 03 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక ప్రచారం రోజురోజుకు ఊపందుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, ఐ అండ్ పి ఆర్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ తో కలిసి వీరు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి, విప్ బీర్ల ప్రతి గల్లి, వాడ తిరుగుతూ కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం చేసి, చేయి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





వీరిలో మధర్ డైరీ ఛైర్మెన్ గుడి పాటి మధు సూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దానావత్ శంకర్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్, ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు భూక్యా రాజారామ్ నాయక్ తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఐనాల మహేందర్ రెడ్డి, నాగాయపల్లి శివ రాములు, సముద్రాల వెంకటేష్, చాడ కరుణాకర్ రెడ్డి, గాజె మల్లేష్, రాజు, చంద్ర శేఖర్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని నేతలు అభ్యర్థించారు. ఈ ఉప ఎన్నికలో విజయం సాధించి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం

తరంగాలు, భిక్నూర్, నవంబర్ 03 : మండల కేంద్రంలోని బిజెపి మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం ఇటీవల జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆపరేషన్ సింధూర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా భిక్కనూర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సందర్భంగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యుండి దేశ సైనికులను మరియు దేశాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని ఈరోజు భారతదేశంలో దేశ సైనికులు ప్రాణాలను తెగించి దేశ ప్రజల కోసం సరిహద్దులలో విధులు నిర్వహిస్తున్నటువంటి సైనికుల పట్ల ఒక రాష్ట్రం ముఖ్యమంత్రి అయ్యుండి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు రేవంత్ రెడ్డి గారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి అత్తిలి తిరుమలేష్ పొన్నాల రంజిత్ మండల ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి నర్సింలు జిల్లా నాయకులు



యాదగిరి గౌడ్ రవీందర్ రెడ్డి నాయకులు పెద్ద సంఖ్యలో గ్రామ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హరీష్ రావుని పరామర్శించిన ఈఎల్వీ భాస్కర్



తరంగాలు, యాదాద్రి భువనగిరి, నవంబర్ 3 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ని ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ డా. భాస్కర్, డైరెక్టర్ అశోక్ లు సోమవారం పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మరణించడం తో హైదరా బాద్ లోని వారి నివాసానికి వెళ్లి నివాళులు అర్పించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇలాంటి కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని, సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బోధన్ లోని లాడ్జిలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయా..?

తరంగాలు, బోధన్, నవంబర్ 3 : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని పలు లాడ్జిలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయని లాడ్జి ఎదుట కొంతమంది ప్రజలు రాకపోకలకు ఇబ్బంది కల్పిస్తున్నారని, టోటల్గా లాడ్జిలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయని ఉదయం నుంచి లాడ్జి ఎదుట కొంతమంది న్యూసెన్స్ చేస్తున్నారని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి బోధన్ అంగడి బజార్ ప్రాంతంలో కూడా కొంతమంది ప్రజలకు అసాంఘిక కార్యక్రమాల్లో భాగంగా ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శలు లేకపోలేదు. ముఖ్యంగా లాడ్జిలు మాత్రం అసంఘక కార్యక్రమాలకి అడ్డగా మారాయని ప్రజలు విమర్శలు చేస్తున్నారు దీనిపై సంబంధిత శాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఈ నెల ఐదు వరకు భీమన్న పండుగ ఉత్సవాలు.. సంఘు పెద్దల చేతుల మీదుగా పోస్టర్ ల ఆవిష్కరణ



తరంగాలు, ఆర్మూర్, నవంబర్ 03 : ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో గల కొమురం భీం విగ్రహం వద్ద ఆదివాసి నాయకపోడ్ కులస్తులు ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో వారి కుల దైవం భీమన్న దేవుని కళ్యాణం కార్తీక పౌర్ణమి రోజున నిర్వహిస్తారు, అట్టి భీమన్న పండుగ కార్యక్రమాల సరళి పోస్టర్ లను ఈ నెల ఐదు న భీమన్న పండుగ సందర్భంగా ఆదివాసి నాయకపోడ్ జిల్లా యువకులకు చేపూర్ ఆదివాసి నాయకపోడ్ కులస్తుడు కీర్తిశేషులు మీనుగు అమ్మేన్న పెద్ద రాజన్న గారి జ్ఞాపకార్థం కబడ్డీ పోటీలు వారి కుమారుడు మీనుగు నాగరాజు నిర్వహించే పోస్టర్ లను ఆర్మూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురకంటి చిన్న రెడ్డి, ఆర్మూర్ మండల ఆదివాసి నాయకపోడ్ మండల ప్రధాన కార్యదర్శి మేడిపల్లి గౌతమ్, విడిసి అధ్యక్షుడు సారంగి శ్రీకాంత్ మాజీ సర్పంచ్ పొద్దుటూరి సత్యనారాయణ, మాజీ చేపూర్ జన్నపల్లి గంగాధర్, ఆర్మూర్ మండల బీజేవైఎం సతీష్ (బబ్లూ), మాజీ సొసైటీ డైరెక్టర్ సారంగి శాంతి కుమార్ న్యాయవాది చరణ్ మండల కుల సంఘ పెద్ద మనుషులు మీనుగు ప్రవీణ్ నర్సయ్య లు ఆవిష్కరించారు. ఇట్టి ఆవిష్కరణ కార్యక్రమంలో మీనుగు నాగరాజు, శ్రీకాంత్,గిరీష్,రాజేందర్,సాగర్, రాజు రాటం గంగాధర్,రాజన్న, భూమేష్ సంఘు సభ్యులు పాల్గొన్నారు. మొదటి రోజు సోమవారం నాడు భీమన్న గుడి నుండి గదలను సంఘ భవనానికి తీసుకుని రావడం రెండవ రోజు మంగళవారం నాడు సంఘ భవనం నుండి భీమన్న దేవుని గదలను ఊరేగింపు, గంగా జలాభిషేకం,సంఘ సభ్యులు వారి కుటుంబ సభ్యులతో కలిసి గంగ స్నానం చేయుట గంగలో పూజల అనంతరం భోజనాలు చేసి తిరిగి భీమన్న గుడి వద్దకు రావడం. మూడవ రోజు చివరి రొజున కార్తీక పౌర్ణమి బుధవారం తెల్లవారుజామున ఉదయం 3 గంటల నుండి భీమన్న దేవుని కళ్యాణం, నాగవెల్లి, అగ్నిగుండం దున్నుట, బసంతమాడుట, మధ్యాహ్నం 12:గంటలకు అన్న ప్రసాద కార్యక్రమం అన్నసత్రం-అన్నదానం నిర్వహించను న్నారు అనంతరం ముగింపు కార్యక్రమంలో భాగంగా కీర్తిశేషులు మీనుగు అమ్మేన్న పెద్ద రాజన్న గారి జ్ఞాపకార్థం జిల్లా ఆదివాసి నాయకపోడ్ యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయనున్నారు

# వందేళ్ల తర్వాత చూద్దాం...

## అభిమాని ప్రపోజల్‌కు రష్మిక ఫన్నీ రిప్లయ్



సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుగ్గా ఉండే ప్రముఖ నటి రష్మిక మందన్న, సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించారు. 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో భాగంగా ఫ్యాన్స్ అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా, ఆసక్తికరంగా సమాధానాలిచ్చారు. ఈ క్రమంలో ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు ఇప్పుడు వైరల్‌గా మారింది. "కాస్త తొందరగానే అడిగేస్తున్నా.. రాబోయే 400-500 ఏళ్ల పాటు నా వాలెంటైన్‌గా ఉంటారా?" అని ఓ నెటిజన్ రష్మికను ప్రశ్నించాడు. ఈ ఊహించని ప్రపోజల్‌కు రష్మిక అంతే చమత్కారంగా స్పందించారు. "ఈ 100 సంవత్సరాల తర్వాత కూడా మనం ఇదే జన్మలో బతికి ఉంటే.. అప్పుడు తప్పకుండా ఉందాం" అంటూ నవ్వుతూ, హృదయం ఎమోజీని జోడించి సమాధానమిచ్చారు. ఇదే సెషన్‌లో తన తదుపరి చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' షూటింగ్ అనుభవాల గురించి కూడా పంచుకున్నారు. "ఇతర సినిమాలతో పోలిస్తే 'ది గర్ల్‌ఫ్రెండ్' షూటింగ్ అనుభవం ఎలా ఉంది?" అని మరో నెటిజన్ అడగ్గా, ఆ సినిమా తనను మానసికంగా చాలా అలసిపోయేలా చేసిందని రష్మిక వెల్లడించారు. "సాధారణంగా మనం మర్చిపోవాలనుకునే ఎన్నో లోతైన, నిజమైన భావోద్వేగాలను ఈ సినిమా కోసం మళ్లీ గుర్తుచేసుకోవాల్సి వచ్చింది. ఆ అనుభవాలను మళ్లీ జీవించడం నాకు చాలా కష్టంగా అనిపించింది" అని ఎమోషనల్ అయ్యారు. ఈ విషయం గురించి దర్శకుడు రాహుల్ రవీంద్రన్‌ను అడిగితే చెబుతారని కూడా ఆమె పేర్కొన్నారు. రాహుల్ రవీంద్రన్ రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రానికి హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా నవంబర్ 7న థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉంది.

# విశ్వవిజేతలకు తారల ప్రశంసలు..

### భారత మహిళల జట్టుకు చిరు, మహేశ్, కమల్ అభినందనలు




భారత మహిళల క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. మొట్టమొదటిసారి ఐసీసీ మహిళల ప్రపంచకప్ 2025ను కైవసం చేసుకుంది. ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసి విశ్వవిజేతగా నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ మహేశ్ బాబు, కమల్ హాసన్ వంటి దక్షిణాది సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా జట్టుకు తమ అభినందనలు తెలిపారు. ఈ చారిత్రక విజయంపై మెగాస్టార్ చిరంజీవి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "భారత క్రికెట్‌లో ఇదొక గర్వకారణమైన, చారిత్రకమైన రోజు. మహిళల ప్రపంచకప్‌లో సంచలన విజయం సాధించిన మన భారత మహిళల జట్టుకు అభినందనలు. కలలు కనడానికి సాహసించిన ప్రతి యువతి, వారిని నమ్మిన ప్రతి తల్లిదండ్రులు, గర్వంగా మద్దతు తెలిపిన ప్రతి అభిమాని విజయం ఇది. మీరు ఇలాగే రాణిస్తూ, అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగాలి. జై హింద్" అని చిరు పేర్కొన్నారు. లోకనాయకుడు కమల్ హాసన్ ఈ విజయాన్ని 1983 ప్రపంచకప్‌తో పోల్చారు. "భారత మహిళల క్రికెట్‌లో 1983 లాంటి క్షణం వచ్చేసింది! మీ పేర్లు చరిత్రలో నిలిచిపోతాయి. మీ స్ఫూర్తి లక్షలాది కలలకు నిప్పురవ్వ అవుతుంది. కంగ్రాట్స్, టీమిండియా!" అంటూ ఆయన ట్వీట్ చేశారు. సూపర్ స్టార్ మహేశ్ బాబు కూడా తన సంతోషాన్ని పంచుకున్నారు. "ఇదొక అద్భుతమైన క్షణం. మువ్వన్నెల జెండా ఎప్పటికంటే ఎత్తున ఎగరడంతో చరిత్రలో గర్వించదగ్గ అధ్యాయం లిఖించబడింది. ఈ టోర్నమెంట్ ఆసాంతం భారత మహిళల జట్టు అసాధారణమైన సంయమనం, పట్టుదల ప్రదర్శించింది. ఈ ఛాంపియన్స్ క్షణం భారత్ అంటే ఏమిటో నిర్వచిస్తుంది" అని ఆయన తన పోస్టులో రాశారు. అదేవిధంగా నటులు గోపీచంద్, మంచు మనోజ్ కూడా జట్టును అభినందించారు. "ప్రతిభ, పట్టుదల, ఎన్నడూ వదలకుండా పోరాడే స్ఫూర్తికి ఇది నిదర్శనం. భయంలేని క్రికెట్ ఎలా ఉంటుందో మన అమ్మాయిలు చూపించారు" అని గోపీచంద్ కొనియాడారు. "మహిళల జట్టు ప్రపంచకప్ సాధించి చరిత్ర సృష్టించింది. ఇది దేశం మొత్తం గర్వించదగ్గ క్షణం" అని మంచు మనోజ్ పేర్కొన్నారు. వీరితో పాటు పలువు-రు సినీ, క్రీడా ప్రముఖులు భారత మహిళల జట్టు చారిత్రక విజయంపై సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు.

# 'శివ'లో ఆ రౌడీ పాత్రకు మోహన్ బాబు.. - ఆర్జీవీ ఎందుకు వద్దన్నారంటే?



తెలుగు సినిమా చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించిన చిత్రం 'శివ'. నాగార్జున కథానాయకుడిగా, రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఒక ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ కల్ట్ క్లాసిక్ చిత్రాన్ని అత్యాధునిక 4కె టెక్నాలజీతో మెరుగుపరిచి నవంబర్ 14న థియేటర్లలో మళ్లీ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ చిత్రంలో రఘువరన్ గ్యాంగ్‌లో ఉండే రౌడీ గణేశ్ పాత్ర సినిమాకు చాలా కీలకం. హీరోను హెచ్చరించే సన్నివేశంలో ఈ పాత్ర మరింత ప్రభావవంతంగా ఉండాలనే ఉద్దేశంతో, నిర్మాత అక్కినేని వెంకట్ ఆ పాత్రకు ప్రముఖ నటుడు మోహన్ బాబు పేరును సూచించినట్లు సమాచారం. ప్రేక్షకులకు సుపరిచితమైన నటుడైతే ఆ సన్నివేశం బాగా పండుతుందని ఆయన భావించారు. అయితే, ఈ ప్రతిపాదనను దర్శకుడు రాంగోపాల్ వర్మ సున్నితంగా తిరస్కరించారట. దీనికి గల కారణాన్ని కూడా ఆయన స్పష్టంగా వివరించినట్లు తెలుస్తోంది. "మోహన్ బాబు గారికి తెలుగు ప్రేక్షకుల్లో ఒక ఫ్యామిలీ మ్యాన్ ఇమేజ్ ఉంది. ఆయన డైలాగ్ డెలివరీకి ఒక ప్రత్యేకమైన స్టైల్ ఉంది. అలాంటి స్టార్‌డమ్ ఉన్న వ్యక్తి రౌడీ పాత్రలో కనిపిస్తే, ప్రేక్షకులు ఆ పాత్రలోని క్రూరత్వాన్ని, భయాన్ని కాకుండా మోహన్ బాబునే చూస్తారు. అది సన్నివేశం సహజత్వాన్ని దెబ్బతీస్తుంది" అని వర్మ చెప్పారట. పాత్రకు వాస్తవికత తీసుకురావాలనే ఆలోచనతో, వర్మ ఆ పాత్ర కోసం కొత్త నటుడు విశ్వనాథ్‌ను ఎంపిక చేశారు. వర్మ తీసుకున్న ఆ నిర్ణయం ఎంత సరైనదో సినిమా చూశాక అందరికీ అర్థమైంది. ఇప్పుడు 'శివ' రీ-రిలీజ్ అవుతున్న వేళ, ఈ పాత జ్ఞాపకాలు మరోసారి సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# నా పెళ్లికి కారణం వాళ్లే.. లవ్ స్టోరీ చెప్పిన శిరీష్



మెగా కాంపౌండ్ హీరో, అల్లు అరవింద్ చిన్న కుమారుడు అల్లు శిరీష్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఇటీవలే నయనికతో ఆయన నిశ్చితార్థం ఘనంగా జరిగింది. అయితే, తమ ప్రేమకథ ఎలా మొదలైందో, కాబోయే భార్య తొలిసారి ఎక్కడ పరిచయమైందో శిరీష్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. వరుణ్ తేజ్ - లావణ్య త్రిపాఠి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు చెబుతూ శిరీష్ తన ప్రేమ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "గతేడాది అక్టోబర్‌లో వరుణ్-లావణ్యల పెళ్లి సమయంలో నటుడు నితిన్, ఆయన భార్య షాలిని ఓ పార్టీ ఇచ్చారు. ఆ వేడుకకు షాలిని బెస్ట్ ఫ్రెండ్ అయిన నయనిక కూడా వచ్చింది. నేను నయనికను తొలిసారి చూసింది అక్కడే" అని శిరీష్ తెలిపారు. ఆ పార్టీలోనే మొదలైన తమ పరిచయం ప్రేమగా మారిందని, ఇప్పుడు నిశ్చితార్థం వరకు వచ్చిందని ఆయన వివరించారు. "భవిష్యత్తులో మా పిల్లలు మన పరిచయం ఎలా జరిగిందని అడిగితే ఇదే కథ చెబుతాను. నన్ను తమ స్నేహితుల సర్కిల్‌లో చేర్చుకున్న నయనిక స్నేహితులందరికీ ధన్యవాదాలు" అని శిరీష్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, అక్టోబర్ 31న అల్లు శిరీష్, నయనికల నిశ్చితార్థ వేడుక కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్, సాయి దుర్గాతేజ్ వంటి ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే.

# హీరోగా 100 సినిమాలు..

## ఇక ఏ పాత్ర అయినా చేస్తా : రాజశేఖర్



హీరోగా దాదాపు వంద చిత్రాలు పూర్తి చేశానని, ఇకపై ఎలాంటి పాత్ర వచ్చినా చేయాలని నిర్ణయించుకున్నట్లు సీనియర్ నటుడు రాజశేఖర్ తెలిపారు. తాజాగా రాజశేఖర్ తన కెరీర్, ఆరోగ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు ఖాళీగా ఉండటం అస్సలు నచ్చదని, పని లేకపోతే జైలులో ఉన్నట్లుగా అనిపిస్తుందని అన్నారు. శర్వానంద్ హీరోగా నటించిన 'బైకర్' సినిమా గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. ఈ చిత్రంలో రాజశేఖర్ ఓ కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఆయన తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "గతంలో ఓ సినిమా షూటింగ్ కోసం విదేశాలకు వెళ్లినప్పుడు, అక్కడి ఫొటోగ్రాఫర్ ఒకరు 'మీ చేతి నిండా పని ఉంది, మీరు చాలా లక్కీ' అన్నారు. ఆ రోజు ఆ మాటకు విలువ పెద్దగా అర్థం కాలేదు. కానీ ఇప్పుడు దాని ప్రాముఖ్యత అర్థమవుతోంది. కరోనా సమయంలో నేను నడవలేని పరిస్థితికి వెళ్లాను. రెండు, మూడు నెలల్లో కోలుకున్నా, పని చేయాలనే తపన మాత్రం తగ్గలేదు," అని వివరించారు. "చాలా కథలు విన్నాను, కానీ ఏవీ నచ్చలేదు. ఆ నిరాశలో ఉన్నప్పుడు దర్శకుడు అభిలాష్ 'బైకర్' కథతో నా దగ్గరకు వచ్చారు. ఈ స్క్రిప్ట్ నాకు ఎంతగానో నచ్చింది. ఓ నటుడిగా ప్రతిరోజూ సెట్ నుంచి ఎంతో సంతృప్తితో ఇంటికి వెళ్లేవాడిని," అని పేర్కొన్నారు. ఈ సినిమా గ్లింప్స్ ముందే చూసి ఉంటే, తానే హీరో పాత్రను అడిగేవాడినంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. ఇదే వేడుకలో తాను చాలాకాలంగా ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ (ఐబీఎస్)తో బాధపడుతున్నానని రాజశేఖర్ వెల్లడించారు. అందుకే వేదికపై మాట్లాడటానికి మొదట కాస్త ఇబ్బంది పడ్డానని అన్నారు. కాగా, అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ స్పోర్ట్స్ డ్రామాలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రం డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com